నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

11 | హైదరాబాద్, సోమవారం 26 ఫిబ్రవరి 2024 | SIDDIPET




పూజలు అందుకుంటున్న ఏడుపాయల వనదుర్గా భవానీమాత

## ఏడుపాయల జనసంద్రం

పాపన్నపేట, ఫిబ్రవరి 25: పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధికి ఆదివారం పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మంజీరా నది పాయల్లో పుణ్యస్నానాలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఈవో మోహన్ రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూధన్ రెడ్డి, రవివీర్ కుమార్, రాజు, ప్రతాప్ రెడ్డి, తోట నర్సింలు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ అన్ని ఏర్పాట్లు చేశారు. వేద పండితులు శంకర శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.



క్యూలైన్లో భక్తుల సందడి



కొలువుదీరిన మల్లికార్జునస్వామి

### కొనసాగుతున్న కొమురవెల్లి మల్లన్న బ్రహ్మోత్సవాలు

**భక్తులతో నిండిన మల్లన్న క్షేత్రం**

**25వేల మందికి పైగా దర్శనం**



కొమురవెల్లిలో భక్తులతో నిండిపోయిన గంగరేగు చెట్టు ఆవరణ పరిసర ప్రాంతం

## ఆరోవారం.. భక్తజన సాగరం

చేర్యాల, ఫిబ్రవరి 25: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల ఆరోవారం సందర్భంగా ఆదివారం పూర్వపు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, మెదక్ తదితర జిల్లాల నుంచి 25వేల మందికి పైగా భక్తులు మల్లన్నను దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ప్రైవేటు, ఆలయ నిర్వహణలో ఉన్న దాతల గదులను అద్దెకు తీసుకుని బస చేశారు. ఆదివారం ఉదయం కోనేరులో స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కొండపైన ఉన్న ఎల్లమ్మకు బోనాలు సమర్పించారు. రాతిగీరల వద్ద ప్రదక్షిణలు, కోడెల స్తంభం వద్ద కోడెలు కట్టి పూజలు చేశారు. గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టి తమ కోరికలు తీర్చాలని స్వామిని వేడుకున్నారు. ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీల శేఖర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు భక్తులకు సేవలందించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి ఆధ్వర్యంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆలయ ఈవో ఎ.బాలాజీ, పునురుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఆరో ఆదివారం వైభవంగా ఉత్సవాలు కొనసాగాయి.

### మరోసారి తెరపైకి

## జహీరాబాద్-బీదర్ రహదారి విస్తరణ

జహీరాబాద్, ఫిబ్రవరి 25: జహీరాబాద్-బీదర్ రోడ్డును జాతీయ రహదారిగా మార్చాలని తెలంగాణ సర్కారు మరోసారి కేంద్రానికి విన్నవించింది. మన్నెగూడ-వికారాబాద్-తాండూర్- జహీరాబాద్-బీదర్ 134 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలని గతంలో బీఆర్ఎస్ సర్కారు కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. 2021 మార్చిలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ఈ రోడ్డును జాతీయ రహదారిగా గుర్తించి అభివృద్ధి చేయాలని కేంద్ర రోడ్లు, ఉపరిత రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి లేఖ రాశారు. ఎంపీ బీబీ పాటిల్ విజ్ఞప్తితో కేంద్ర మంత్రి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించారు. అప్పట్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించినా కేంద్రం పెండింగ్‌లో పెట్టింది. దీంతో రోడ్డు విస్తరణ పెండింగ్‌లో ఉండిపోయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి విన్నవించడంతో ఈ రోడ్డు విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

**మూడు రాష్ట్రాల్లో విస్తరణ...**

మన్నెగూడ- వికారాబాద్- తాండూర్- జహీరాబాద్-బీదర్ 134 కిలోమీటర్ల రోడ్డు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలో విస్తరించి ఉంటుంది. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కేంద్రం ఆదేశించినట్లు తెలిసింది. జహీరాబాద్, బీదర్, దెగ్లూర్ 112 కిలోమీటర్ల రోడ్డును జాతీయ రహదారిగా నిర్మాణం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. జహీరాబాద్ నుంచి తెలంగాణ సరిహద్దు వరకు 26 కిలోమీటర్లు ఈ రోడ్డు విస్తరించి ఉంది. జాతీయ రహదారిగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన పూర్తి వివరాలతో రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ కేంద్రానికి లేఖ రాసినట్లు అధికారులు తెలిపారు. జహీరాబాద్-బీదర్ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ నుంచి ప్యాసింజర్, గూడ్స్ ఇతర వాహనాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వెళ్తుంటాయి. వందలాది వాహనాలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. జహీరాబాద్ నిమ్జ్ మధ్యలో నుంచి ఈ రోడ్డు వెళ్తుంది. తద్వారా పారిశ్రామిక అభివృద్ధికి ఉపకరిస్తుంది.



జహీరాబాద్- బీదర్ రోడ్డు

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

*మెదక్ జిల్లా యువజన క్రీడల శాఖాధికారి నాగరాజు*

*రామాయంపేటలో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలు ప్రారంభం*



రామాయంపేటలో జిల్లా సైక్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న క్రీడల శాఖ జిల్లా అధికారి నాగరాజు

రామాయంపేట, ఫిబ్రవరి 25 : క్రీడల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబర్చాలని మెదక్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి నాగరాజు అన్నారు. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ఆదివారం రామాయంపేట గజ్వేల్ రోడ్డులో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో 80 మంది విద్యార్థులతో జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-14, అండర్-17 పోటీలకు జిల్లా నుంచి 80 మంది హాజరయ్యారన్నారు. జాతీయ సైక్లింగ్ అవార్డు గ్రహీత, పీఈటీ దండు యాదగిరి నేతృత్వంలో యువతకు సైక్లింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. తమ పిల్లలు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చేలా తల్లితండ్రులు ప్రోత్సహించాలని, అప్పుడే వారు పైస్థాయికి ఎదుగుతారని తెలిపారు. కార్యక్రమంలో ధ్యాన్‌చంద్ పీఈటీల సంఘం సభ్యులు శ్రీనివాస్, సైక్లింగ్ కోచ్ దండు యాదగిరి పాల్గొన్నారు.

## హల్దీ వాగులో గోదావరి పరవళ్లు

వెల్దుర్తి, ఫిబ్రవరి 25: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గజ్వేల్ సమీపంలో నిర్మించిన కొండపోచమ్మసాగర్ నుంచి ఎనిమిది రోజుల క్రితం వదిలిన గోదావరి జలాలు మూడు రోజుల క్రితం మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలో ప్రవేశించాయి. రెండు రోజుల నుంచి మాసాయిపేట మండల పరిధిలోని హక్కీపేట గ్రామశివారులో ఉన్న చిన్ననీటి తరహా ప్రాజెక్టు హల్దీ ప్రాజెక్టులోని నీళ్లు రాగా, రెండు రోజుల నుంచి ప్రాజెక్టు నిండి ఆదివారం మధ్యాహ్నం సమయంలో నీళ్లు కిందకు పారడం ప్రారంభమైంది. బీఆర్ఎస్ ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మూడేండ్ల నుంచి మండుటెండల్లోనూ హల్దీ వాగులో నీళ్లు ప్రవహిస్తుండడంతో పరీవాహక రైతులకు సాగుకు ధీమా ఏర్పడింది. వాగు వెంబడి ఉన్న గ్రామాలకు తాగునీటి కష్టాలు సైతం తీరాయి. పది రోజుల క్రితం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం కొండపోచమ్మసాగర్ నుంచి నీటిని విడుదల చేయడంతో హల్దీవాగులో గోదావరి నీళ్లు ప్రవహిస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదల కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.




మెదక్ జిల్లా హల్దీవాగు ప్రాజెక్టు చేరిన గోదావరి జలాలు



## పరీక్షల పేరుతో దోపిడీ..!

- **ల్యాబ్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్ల ఇష్టారాజ్యం**
- **అనర్హులతో మెడికల్ షాపుల నిర్వహణ**
- **నిబంధనలను పాటించని నిర్వాహకులు**



మెదక్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలో మెడికల్ మాఫియా ఆరోగ్య పరీక్షల పేరుతో ప్రజలను ఇష్టారీతిన దోచుకుంటున్నది. ల్యాబ్‌లు, ఎక్స్‌రే, స్కానింగ్ సెంటర్లలో పరీక్షలకు సంబంధించి ఎలాంటి ధరల పట్టిక ఉండట్లేదు. అనధికారికంగా సెంటర్లు నడిపిస్తూ నిబంధనలు పాటించకుండా రోగుల వద్ద రూ.లక్షల్లో వసూలు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికార యంత్రాంగం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఓ దవాఖానలో అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్ నిర్వహిస్తూ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

**రోగులతో వ్యాపారం...**

జిల్లాలో ప్రైవేట్ దవాఖానలు సుమారు 115 వరకు ఉన్నాయి. వీటిల్లో స్కానింగ్ కేంద్రాలు, డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లు, ఎక్స్‌రే సెంటర్లు ఉన్నాయి. డీఎంఎల్‌టీ, రేడియోలజిస్ట్, ఫార్మాసిస్ట్ కోర్సులు చదవకున్నా కేవలం అనుభవం ఉన్న వారితో ఈ సెంటర్లను నిర్వహిస్తున్నారు. మెడికల్ దుకాణాలు పేరు ఒకరిదైతే మరొకరు నడిపిస్తున్నారు. జనరిక్ పేరుతో అడ్డగోలుగా మందులు అంటగట్టి దోచుకుంటున్నారు. మందులకు బిల్లులు సైతం ఇవ్వడం లేదు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కొందరు ప్రైవేట్ వ్యక్తులు డాక్టర్లను తీసుకొచ్చి ఎలాంటి అనుమతులు లేకుండా దవాఖానలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

**ధరల పట్టిక ఏర్పాటు చేయాల్సిందే..**

జిల్లాలో దవాఖానలు, ల్యాబ్‌లు, స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలు తప్పకుండా వైద్యశాఖ నిబంధనలు పాటించాలి. కేంద్రాల్లో తప్పకుండా ధరల పట్టికను ఏర్పాటు చేయాలి. అర్హులైన వారితో పరీక్షలు చేయించాలి. అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకుంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు.

– డాక్టర్ చందునాయక్, డీఎంహెచ్‌వో, మెదక్



## ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్




నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే రాఘునందన్‌రావు

గజ్వేల్/ తూప్రాన్, ఫిబ్రవరి 25: ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర ఆదివారం సాయంత్రం తూప్రాన్ చేరుకుంది. పట్టణంలో నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాడుతూ నాయకుడు లేని పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లి గడపడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక ఆ పార్టీ నాయకులు గత ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని, హామీలు ఇచ్చే ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సీఎం రేవంత్ రెడ్డికి తెలియదా అని ప్రశ్నించారు. అనంతరం నాచగిరి లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని నాచారం మీదుగా గజ్వేల్ వెళ్లారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు, మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పార్లమెంట్ కన్వీనర్ రామ్మోహన్ గౌడ్, సాయిబాబా గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ అంటేనే అవినీతి, దోపిడీ**

'కాంగ్రెస్ అంటేనే అవినీతి, దోపిడీ ఆ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రూ.12లక్షల కోట్ల అవినీతి జరిగింది'. అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆదివారం రాత్రి గజ్వేల్ పట్టణం ఇందిరాపార్కు చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. సోనియాగాంధీతో పాటు మాజీ ముఖ్యమంత్రులు బెయిల్‌పైనే బయట ఉన్నారని, కాంగ్రెస్ నాయకులు కోర్టుల చుట్టూ తిరగడానికే పరిమితమవుతున్నారని ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా ఆ పార్టీకి ప్రస్తుతం 40సీట్లు ఉన్నాయని, రాబోయే ఎన్నికల్లో ఇంకా తగ్గుతాయన్నారు. చావుతప్పి కన్నులొట్టపోయినట్లు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ గెలిచేది లేదు సచ్చేది లేదన్నారు. డబ్బు, కులాన్ని చూసి ఓటు వేయకుండా మీకోసం, దేశాభివృద్ధి కోసం నిజాయితీగా అవినీతికి తావు లేకుండా ఓటు వేయాలని ప్రజలను కోరారు. నరేంద్రమోదీ హయాంలో ఒక్క రూపాయి అవినీతి కూడా జరగలేదన్నారు. వచ్చే 25 సంవత్సరాల్లో ప్రపంచానికి పోటీగా భారత్ అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ బాబు, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, నాయకులు రాణిరుద్రమ, ఆకుల రాజయ్య, మహేశ్, సురేశ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



తూప్రాన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

## ఆత్మరక్షణకు కరాటే అవసరం

*నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మా రెడ్డి*

నర్సాపూర్, ఫిబ్రవరి 25: ఆత్మరక్షణకు కరాటే ఎంతో అవసరమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిన్నచింతకుంట గ్రామ సమీపంలో గల శ్రీనివాస గార్డెన్స్‌లో 2024 నేషనల్ ఓపెన్ కుంగ్ ఫూ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్, ప్రోగ్రామ్ కన్వీనర్ పోచయ్య, కరాటే మాస్టర్ పాముల శ్రీనివాస్, వినోద్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సత్యంగౌడ్, మాజీ జడ్పీటీసీ చౌటి మాధవి జగదీశ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, బీఆర్ఎస్ నాయకులు తొంట వెంకటేశ్, సూరారం నర్సింహులు, మహమ్మద్, షేక్ హుస్సేన్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డికి మెమొంటోను అందజేస్తున్న అకాడమీ బృందం